క్లుప్తంగా

220 మందికి కంటి పరీక్షలు



వైద్య శిబిరంలో కంటి పరీక్షలు చేస్తున్న దృశ్యం

భీమవరం: కంటి సమస్యలతో బాధపడుతున్న ప్రజలు సరైన చికిత్సలు చేయించుకోవాలని కృష్ణ బలిజ పూసల కార్పొరేషన్ చైర్మన్ గంటా త్రిమూర్తులు అన్నారు. భీమవరం 4వ వార్డు నరసయ్య అగ్రహారంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని చైర్మన్ త్రిమూర్తులు ఆదివారం ప్రారంభించారు. ఈ శిబిరంలో 220 మందికి కంటి వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో యలమంచిలి శ్రీనివాస్, విన్నకోట వినాయక్, కొత్తపల్లి శ్రీనివాస్, దాసరి మాధవ, ముత్యాలపల్లి మౌళి, విన్నకోట చిన్న, దాసరి సునీల్, ములపర్తి శివకుమార్, మాదాసు శివ, వైద్యులు ఎస్ శ్రీహరి, కె దివ్య, చిన్న, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల సేవలు అభినందనీయం



మెడికల్ క్యాంపులో రోగులకు వైద్యసేవలు అందిస్తున్న దృశ్యం

భీమవరం: అల్లూరి సీతారామరాజు భగత్‌సింగ్ సేవా విజ్ఞాన కేంద్రం ట్రస్టు ఆధ్వర్యంలో మెంటేవారితోటలోని ట్రస్టు కార్యాలయంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. తొలుత ముఖ్య అతిథిగా పాల్గొన్న వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట్రామరాజు విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత వైద్యశిబిరంలో సేవలు అందిస్తున్న వైద్యులు వి. శ్రీనివాసరావు, దాట్ల కృష్ణంరాజు, వలంటీర్లకు, మెడికల్ రిప్స్‌కు అభినందనలు తెలిపారు. ఈ శిబిరంలో బీపీ, సుగరు, ఫిట్స్, ఫెరాలసిస్ వంటి వ్యాధులకు వైద్య సేవలు అందించారు.

ఐద్వా నాయకురాలు విమలమ్మకు నివాళి



విమలమ్మకు నివాళులర్పిస్తున్న మహిళలు

ఆకివీడు: ఉమ్మడి జిల్లాలో మహిళా ఉద్యమనేతగా సేవలందించి, ఉద్యమానికి స్ఫూర్తిదాయకంగా నిలిచిన ఐద్వా నాయకురాలు విమలమ్మ మరణం తీరని లోటని పట్టణ అధ్యక్షురాలు డోకల లక్ష్మి అన్నారు. స్థానిక ఐద్వా కార్యాలయంలో ఆదివారం విమలమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం డోకల లక్ష్మి మాట్లాడుతూ మహిళా సమస్యల పరిష్కారానికి విమలమ్మ విశేషంగా కృషి చేశారన్నారు. కార్యక్రమంలో ఐద్వా నాయకురాళ్లు, మహిళలు పాల్గొన్నారు.

పశువుల దాణా పంపిణీ



పాడి రైతులకు పశువుల దాణా అందిస్తున్న అధికారులు

యలమంచిలి: వరద ప్రభావిత గ్రామాలైన కనకాయలంక, పెదలంక గ్రామాలలోని పాడి రైతులకు ఆదివారం పశు సంవర్ధక శాఖ అధికారులు పశువుల దాణా పంపిణీ చేశారు. కనకాయలంక గ్రామంలో 128 మంది రైతుల వద్ద ఉన్న 480 పశువులకు పశువుకు 25 కిలోల చొప్పున 12 టన్నులు, పెదలంక గ్రామంలో 48 మంది రైతుల వద్ద ఉన్న 320 పశువులకు పశువుకు 25 కిలోల చొప్పున 8 టన్నులు వెరసి మొత్తం రూ.4.44 లక్షల విలువైన 20 టన్నుల పశువుల దాణా అందజేసినట్లు మండల పశు వైద్యాధికారి డాక్టర్ పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కనకాయలంక, పెదలంక సర్పంచ్‌లు మద్దా శ్రీనివాసరావు, తాళ్ల నాగరాజు నాయకులు మామిడిశెట్టి పెద్దిరాజు, బొప్పన హరికిషోర్, ఆరుమిల్లి రామ శ్రీనివాస్, కడలి గోపాలరావు, పులి శ్రీరామమూర్తి, ముస్కుడి రాంబాబు పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ

యలమంచిలి: మేడపాడు గ్రామంలోని నిరుపేద కుటుంబాలకు గడచిన ఐదేళ్లుగా హోప్ హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ సభ్యులు ప్రతి నెలా నిరు పేదలు, వృద్ధులకు నెలకు సరిపడ నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం గ్రామంలో గొంతు క్యాన్సర్ కారణంగా పనికి వెళ్లలేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్న కొప్పిశెట్టి సూరయ్య కుటుంబానికి ఈనెల నుంచి కొత్తగా నిత్యావసరాలు పంపిణీ ప్రారంభించినట్లు సంస్థ ప్రతినిధి ముద్దల రాధాకృష్ణ తెలిపారు. సొసైటీ మాజీ అధ్యక్షులు ఓడూరి వెంకటేశ్వరరావు చేతుల మీదుగా ఈనెల సరుకులు పంపిణీ చేశారు.

కలెక్టరేట్ తరలింపుపై నిరసన

భీమవరం నుంచి కలెక్టరేట్‌ను ఉండి నియోజవర్గం కాళ్ల మండలం పెదఅమిరం ప్రాంతానికి తరలిపోతుందనే ప్రచారం, ఆపై కూటమి నేతలు సైతం దానికి ఊతమిచ్చేటట్లు చేస్తున్న ప్రకటనలతో భీమవరం చుట్టుపక్కల ప్రాంతాల ప్రజల్లో నిరసన వ్యక్తమవుతోంది. కలెక్టరేట్ ఏర్పాటుకు భీమవరం అన్ని విధాల సరైనదని భావించి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోగా ప్రస్తుత కూటమి ప్రభుత్వం కలెక్టరేట్‌ను పెద అమిరం తరలించేందుకు చేస్తున్న కుట్రలపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అందరికీ అనువైన ప్రాంతమైన భీమవరంలోనే కలెక్టరేట్ ఉండాలని, కలెక్టరేట్ తరలింపు చర్యలను ప్రభుత్వం నిలుపుదల చేయాలని ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు. – భీమవరం (ప్రకాశం చౌక్)



భీమవరంలోని కలెక్టరేట్

భీమవరంలోనే కొనసాగించాలి



భీమవరంలోనే కలెక్టరేట్‌ను కొనసాగించాలి, మరో చోట తరలింపు చర్యలను వ్యతిరేకిస్తున్నాం. కలెక్టరేట్ తరలింపునకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న ప్రతి ఒక్కరికీ మా మద్దతు ఉంటుంది. ఇక్కడే కలెక్టరేట్ ఉండడం వల్ల భీమవరం మరింత అభివృద్ధి చెందుతుంది. మున్సిపాలిటి నుంచి కార్పొరేషన్ స్థాయికి చేరుతుంది. భీమవరం అభివృద్ధి చెందడం వల్ల చుట్టుపక్కల ప్రాంతాల వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

– కె.రామకోటేశ్వరరావు, టైలర్స్ అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు

భీమవరంలోనే ఉండాలి



అభివృద్ధి చెందిన భీమవరంలోనే కలెక్టరేట్ ఉండాలి. జిల్లాలోని అన్ని నియోజవర్గాల ప్రజలకు భీమవరం కలెక్టరేట్ అందుబాటులో ఉంది. గత నాలుగేళ్లగా కలెక్టరేట్ వల్ల జిల్లా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేవు. ఇప్పుడు మరో చోటకు కలెక్టరేట్ తరలింపు చర్యలు సరైనవి కావు. భీమవరంలో కలెక్టరేట్ ఉండేలా కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తుంది.

– అంకెమ్ సీతారామ్ భీమవరం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి

కలెక్టరేట్‌ను తరలిపోనివ్వం



అందరికీ అందుబాటులో ఉన్న భీమవరంలోనే కలెక్టరేట్ కొనసాగాలి. కలెక్టరేట్ మరో చొటకు తరలింపు నిర్ణయం వెనక్కు తీసుకోవాలి. గతంలో భీమవరం పరిధిలో ఉన్న ఆర్డీవో కార్యాలయాన్ని స్థలం ఇస్తామని ఉండి నియోజకవర్గం తీసుకువెళ్లిపోయారు. భీమవరం నుంచి కలెక్టరేట్ తరలించకుండా పోరాటం చేస్తాము.

– ఇంటి సత్యనారాయణ, ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు

అందరికీ అందుబాటులో



భీమవరంలో కలెక్టరేట్ అందుబాటులో ఉండడంతో సులభంగా సేవలు అందుతున్నాయి. రోడ్డు, రైలు మార్గంలో ప్రజలు సులభంగా కలెక్టరేట్‌కు చేరుకుని వారి పనులు సకాలంలో పూర్తి చేసుకుంటున్నారు. కలెక్టరేట్ ఉంటే భీమవరం మరింత అభివృద్ధి చెందడంతో సమీప గ్రామాల ప్రజలకు మరింత ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయి.

– బి.రాంబాబు, కొండేపూడి

భీమవరం అభివృద్ధికి సహకరించాలి



భీమవరం అభివృద్ధికి అందరూ సహకరించాలి. జిల్లా కేంద్రంగా భీమవరం ఉండడం వల్ల సీఎస్ఆర్ ఫండ్స్‌తో అధునికీకరణ పనులు జరుగుతున్నాయి. ఇప్పుడు జిల్లా కలెక్టరేట్ తరలిస్తే భీమవరం అభివృద్ధి కుంటుపడుతుంది. ప్రశాంతంగా ఉన్న భీమవరం ప్రజల్లో కలెక్టరేట్ తరలింపు ఆందోళన కలిగిస్తోంది.

– చాపాని శివగణేష్ తూర్పుకాపు యువజన నాయకుడు, భీమవరం

వైభవంగా గణపయ్య ఊరేగింపులు

ఆకివీడు: వినాయక చవితి మహోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన గణపతి విగ్రహాలకు ఆదివారం పలుచోట్ల ఊరేగింపు నిర్వహించి నిమజ్జనం చేశారు. స్థానిక జవహర్ పేటలోని చర్చి వీధిలో ఏర్పాటు చేసిన మట్టి వినాయక ప్రతిమను ఘనంగా ఊరేగించారు. ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలు, బాలలు, యువకులు అధికంగా పాల్గొన్నారు. అనంతరం వెంకయ్య వయ్యేరులో నిమజ్జనం చేశారు.

కూరగాయలతో అలంకరణ

స్థానిక వరసిద్ధి వినాయక స్వామి ఆలయం వద్ద గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారిని కూరగాయలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. శాంతి హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి నైవేద్యంగా సమర్పించిన లడ్డూ ప్రసాదాన్ని వేలంపాట నిర్వహించారు. గోపూజ చేశారు. శివ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వీరవాసరంలో...

వీరవాసరం: గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆదివారం మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో నిమజ్జనం ఉత్సవాలను ఘనంగా చేపట్టారు. ముందుగా స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మేళ, తాళాలతో బాణాసంచా కాల్పుల మధ్య వినాయక విగ్రహాలను ఊరేగించి నిమజ్జనం చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

జలసిద్ధి వినాయకుని నిమజ్జనం

ఉండి: చవితి మహోత్సవాలను పురస్కరించుకుని నిర్వహిస్తున్న వినాయక నిమజ్జనాల్లో భాగంగా ఆదివారం ఎన్నార్పీ అగ్రహారం బీసీ కాలనీలో వేంచేసియున్న జలసిద్ధి వినాయకస్వామి వారి ప్రతిమను ఘనంగా నిమజ్జనం చేశారు. తీన్‌మార్ వాయిద్యాలు, బానాసంచా కాల్పుల నడుమ స్వామివారిని ప్రధాన ప్రాంతాల్లో వైభవంగా ఊరేగించి అనంతరం నిమజ్జనం చేశారు. అలాగే దేవుడిగుడి దొడ్డి ప్రాంతంలోను ఏర్పాటు చేసిన గణపతి ప్రతమిను కూడా నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమాలకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.



ఆకివీడులో వైభవంగా వినాయకుని ఊరేగింపు



వీరవాసరంలో ఊరేగింపులో యువకుల సందడి



ఉండి దేవుడిగుడి దొడ్డిలో స్వామివారిని నిమజ్జనానికి తరలిస్తున్న దృశ్యం



నరసయ్య అగ్రహారంలో అన్నదానంను ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి

అఖండ అన్నసమారాధన

భీమవరం: పట్టణంలోని నరసయ్య అగ్రహారంలో అల్లూరి సీతారామరాజు యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ వరసిద్ధి వినాయక 27వ వార్షిక మహోత్సవాల సందర్భంగా ఆదివారం అఖండ అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా అల్లూరి సీతారామరాజు యువజన సంఘం సభ్యులను అభినందించారు.

దొంగపిండిలో అన్నసమారాధన

భీమవరం అర్బన్: మండలంలోని దొంగపిండి గ్రామంలో శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అన్నసమారాధన ఘనంగా నిర్వహించారు. చివరి రోజు కావడంతో స్వామిని డప్పు వాయిద్యాలు, బాణ సంచాల నడుమ గ్రామ పురవీధులు గుండా వైభవంగా ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. సుమారు 2 వేల మంది అన్నసమారాధనలో పాల్గొన్నారు.

మానవత నూతన కార్యవర్గం

వీరవాసరం: మానవత వీరవాసరం మండల శాఖ నూతన కార్యవర్గాన్ని ఆదివారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఎన్నుకున్నారు. చైర్మన్‌గా మళ్ల రాంబాబు, ప్రెసిడెంట్‌గా యరకరాజు చినబాబు, సెక్రటరీగా కోటిపల్లి బాబు, ట్రెజరర్‌గా గులిపల్లి కిరణ్, వైస్ ప్రెసిడెంట్‌గా గంధం ఏసుబాబు ఎంపికయ్యారు. కార్యక్రమంలో మానవత జిల్లా అధ్యక్షుడు కండెపు సూర్యనారాయణ, కార్యదర్శి భోగవల్లి వెంకట సుబ్బారావు, స్టేట్ కన్వీనర్ సాగిరాజు జానకిరామరాజు, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నిబద్ధతతో పనిచేసిన ఉద్యోగులకు గుర్తింపు



రవికుమార్ దంపతులను సత్కరిస్తున్న కలెక్టర్, జేసీ

భీమవరం (ప్రకాశంచౌక్): నిబద్ధతతో పనిచేసిన ఉద్యోగులకు నిరంతరం గుర్తింపు ఉంటుందని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. జిల్లాల పునర్విభజనలో భాగంగా ఏర్పడిన పశ్చిమగోదావరి జిల్లా భీమవరం కలెక్టర్ కార్యాలయంలో ల్యాండ్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ పొందిన సీహెచ్ రవికుమార్‌ను కలెక్టరేట్ పీజీఆర్ఎస్ సమావే మందిరంలో శనివారం రాత్రి కలెక్టర్ నాగరాణి, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డీఆర్వో బి.శివన్నారాయణ రెడ్డి దుశ్శాలువాతో సత్కరించారు.

గణపవరం మండలాన్ని 'పశ్చిమ' లోనే కొనసాగించాలి



వినతిపత్రాన్ని అందిస్తున్న ఆప్కాబ్ చైర్మన్ గన్ని, అఖిలపక్షం నేతలు

కాళ్ల: గణపవరం మండలాన్ని పశ్చిమగోదావరి జిల్లాలోనే కొనసాగించాలని కోరుతూ ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు సమక్షంలో అఖిలపక్షం నాయకులు ఆదివారం పెదఅమిరంలో డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజుకు వినతి పత్రం అందజేశారు. మండలంలోని 25 గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ముక్తకంఠంతో మండలం మార్పును వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. దీనిపై మండల పరిషత్‌లో కూడా తీర్మానించినట్లు వివరించారు. ఈ సందర్భంగా రఘురామకృష్ణంరాజు మాట్లాడుతూ అన్ని విషయాలు సమగ్రంగా పరిశీలించి తగిన సాయం చేస్తామన్నారు.

వసుధ సేవలు అభినందనీయం

పాలకోడేరు: వసుధ ఫౌండేషన్ అందిస్తున్న సమాజ సేవ అభినందనీయమని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. గరగపర్రు గ్రామంలో వసుధ వాత్సల్య కేంద్రం వద్ద ఆదివారం వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకటరామరాజు ఆధ్వర్యంలో కలెక్టర్ నాగరాణి చేతుల మీదుగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి తూర్పు పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన 21 సేవా సంస్థలకు రూ.28 లక్షలు చెక్కుల రూపంలో అందించారు. అంతేకాకుండా 11 మంది రోగులకు రూ.2.50 లక్షల నగదు అందించారు. ప్రతిభ కనబరిచిన 30 మంది పేద విద్యార్థులకు రూ.2.10 లక్షల ఉపకార వేతనంగా అందించారు. ఈ సందర్భంగా చైర్మన్ మంతెన వెంకటరామరాజు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు తదితరులు పాల్గొన్నారు.



గరగపర్రులో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

రైతుల అభివృద్ధికి కృషి చేస్తా

పాలకోడేరు: పాలకోడేరు విశాల సహకార పరపతి సంఘం త్రిసభ్య కమిటీ నూతన అధ్యక్షుడిగా కొత్తపల్లి నాగరాజు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కమిటీ సభ్యులు పాల నాగ గంగాధర్, అప్పారావులచే నాగరాజు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ రైతుల అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. గతంలో చైర్మన్‌గా పనిచేసిన కాలం నుంచి ఆక్వారంగానికి సంబంధించిన మేతలను కూడా సొసైటీ ద్వారా ఆక్వా రైతులకు అందజేశామని ఇప్పుడు కూడా దాన్ని కొనసాగిస్తామన్నారు. ఈ సమావేశానికి హాజరైన డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు, కేంద్ర మంత్రివర్యులు భూపతిరాజు శ్రీనివాస్ వర్మ, రాజ్యసభ సభ్యుడు పాకా సత్యనారాయణ తదితరులు నాగరాజుకు అభినందనలు తెలిపారు.



నూతన సొసైటీ అధ్యక్షుడు కొత్తపల్లి నాగరాజును అభినందిస్తున్న దృశ్యం

క్రీడల్లో పేదలకు తోడ్పాటు అందించాలి

పెనుమంట్ర: పడాల ప్రహ్లాదరెడ్డి ఆశయ స్ఫూర్తి లక్ష్యంగా కమిటీ సభ్యులు చిత్తశుద్ధితో పని చేసి, క్రీడల్లో పేదలకు తోడ్పాటునివ్వాలని ప్రహ్లాదరెడ్డి మెమోరియల్ బాస్కెట్‌బాల్ ట్రస్ట్ గౌరవ అధ్యక్షుడు అల్లం బుల్లిరెడ్డి అన్నారు. ట్రస్ట్ సర్వసభ్య సమావేశం ఆదివారం మార్టేరు రోటరీ భవనంలో నరసాపురం ఆర్టీసీ డిపో మేనేజర్ సత్తి సుబ్బన్న రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న బుల్లి రెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాంతానికి చెందిన ఎంతోమంది పూర్వ విద్యార్థులు క్రీడల్లో రాణించి ప్రభుత్వ ఉద్యోగాల్లో ఉన్నత స్థితిలో ఉన్నారంటే ప్రహ్లాదరెడ్డి ఆనాడు విద్యార్థులకు ఇచ్చిన తర్ఫీదు కారణమన్నారు. అనంతరం సుబ్బన్న రెడ్డి మాట్లాడుతూ ఎస్వీజీ పాఠశాలలో క్రీడా ప్రాంగణాన్ని అభివృద్ధి పరిస పేద క్రీడ విద్యార్థుల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తూ సమ్మర్ క్యాంపులు నిర్వహణకు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా మూడేళ్ల పాటు ఉండే ట్రస్ట్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుగా అల్లం బుల్లి రెడ్డి, సత్తి సుబ్బన్న రెడ్డిలతోపాటు నిర్వహణ కమిటీ అధ్యక్షుడిగా గుడిమెట్ల లక్ష్మారెడ్డి, కార్యదర్శిగా అల్లం భాస్కర్‌రెడ్డి ,కోశాధికారిగా గోలుగురు సత్యనారాయణ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా కడలి సుబ్రహ్మణ్యం తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



పడాల ప్రహ్లాద రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ నూతన కార్యవర్గ సభ్యులు

డంపింగ్ యార్డులుగా పంట కాల్వ గట్లు

ఆకివీడు: పంట కాల్వ గట్లు డంపింగ్ యార్డులకు నిలయాలుగా మారాయి. గ్రామీణ ప్రాంతాల్లోని పంట కాల్వ గట్లుపైనే గ్రామాల్లోని వ్యర్థాలు పారవేస్తున్నారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా వెంకయ్య వయ్యేరు పంట కాల్వ, ఉండి పంట కాల్వల వెంబడి వ్యర్థాలు పేరుకుపోయాయయి. ఉండి పంట కాల్వ గట్టుపై కలిసిపూడి, చెరుకువాడ, ఉండి, ఎన్నార్పీ అగ్రహారం తదితర గ్రామాల్లో వ్యర్థాలు గుట్టలుగా కన్పిస్తున్నాయి. వెంకయ్య వయ్యేరు పంట కాల్వ గట్టుపై స్థానిక పెద్ద వంతెన వద్ద, శ్రీరాంపురం, సంతోపేట, అయిభీమవరం, చెరుకుమిల్లి తదితర గ్రామాల్లో గట్లపైనే చెత్త దర్శనమిస్తోంది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



పంట కాల్వ గట్లపై వ్యర్థాలు వేస్తున్న దృశ్యం

ఆర్యన్ ఉదయ్‌కు సత్కారం

భీమవరం: లండన్ డిప్యూటీ మేయర్‌గా ఎన్నికైన ఆర్యన్ ఉదయ్ అరేటికి ఆదివారం ప్రజా ప్రతినిధులు, భీమవరం పట్టణ ప్రముఖులు ఘనంగా పౌర సన్మానం చేశారు. స్థానిక శ్రీ కృష్ణ దేవరాయ సంస్కృతి సమితి ఆధ్వర్యంలో జరిగిన సభకు శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబు, రాజ్యసభ సభ్యుడు పాకా సత్యనారాయణ, ఎమ్మెల్సీ బి.గోపీమూర్తి హాజరై మాట్లాడారు. భారతీయుడిగా ఉదయ్ లండన్‌లో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం వివిధ సంఘాల ప్రతినిధులు ఆర్యన్ ఉదయ్ అరేటిని ఘనంగా సన్మానించారు.



ఆరేటి ఉదయ్‌ను సన్మానిస్తున్న ప్రజా ప్రతినిధులు, నాయకులు

శ్రీనివాసరావు కవితకి ఎక్స్ రే అవార్డు

పాలకొల్లు సెంట్రల్: విజయవాడకి చెందిన ఎక్స్ రే సాహిత్య సంస్థ ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయిలో నిర్వహించిన జాతీయ స్థాయి కవితల పోటీల్లో పాలకొల్లు రసధుని సాహితీ సంస్థ కార్యదర్శి, ప్రముఖ కవి, రచయిత మామిడిశెట్టి శ్రీనివాసరావు రచించిన 'గెలుపోటముల ఆట' అనే కవితకు ఉత్తమ కవితా అవార్డు వచ్చింది. ఈ పోటీలకు ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల నుంచి మొత్తం 358 కవితలు రాగా ఈ కవిత 3 వ స్థానంలో నిలిచి అవార్డుకి ఎంపికైంది. ఆదివారం ఉదయం విజయవాడ స్వాతి బిల్డింగ్స్‌లో జరిగిన అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో కృష్ణా జిల్లా పూర్వపు కలెక్టర్ మహ్మద్ ఇంతియాజ్, డిప్యూటీ కలెక్టర్ కొమ్మెర్ల కృష్ణవేణి, ఎక్స్ రే సంస్థ అధ్యక్షులు కొల్లూరి, న్యాయ నిర్ణేత సర్వజిత్ చేతుల మీదుగా శ్రీనివాసరావు అవార్డు అందుకున్నారు.

విద్యుత్ షిఫ్ట్ ఆపరేటర్‌పై ఫిర్యాదు

యలమంచిలి: స్థానిక 11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో షిఫ్ట్ ఆపరేటర్‌గా పని చేస్తున్న గుబ్బల జగదీష్ విధి నిర్వహణలో అలసత్వం వహిస్తున్నాడని వచ్చిన ఫిర్యాదుపై ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్లు ఎలక్ట్రికల్ ఏఈవి చండీ కిరణ్ తెలిపారు. రెండు రోజుల క్రితం రాత్రి 12 గంటల సమయంలో యలమంచిలి, చించినాడ, కాజ గ్రామానికి వెళ్లే లైన్ ట్రిప్ అవ్వడంతో వినియోగదారులు ఫోన్ చేశారు. జగదీష్ ఫోన్ తీయకపోవడంతో లైన్‌మెన్ సబ్ స్టేషన్ వెళ్లారు. నిద్రపోతున్న జగదీష్ లేపి, లైన్ ట్రిప్ అయిన సంగతి అడగగా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పాడు. అయితే జగదీష్ గతంలో పలుమార్లు ఇదే విధంగా నిర్లక్ష్యంగా వ్యవహరించడని సిబ్బంది, వినియోగదారులు ఆరోపిస్తూ ఏఈకి ఫిర్యాదు చేశారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్లు ఏఈ పేర్కొన్నారు.